కరువైంది. దాంతో స్లీపింగ్ పిల్స్‌ను ఆశ్రయించాను.

* * *

''ప్లీజ్.. నన్ను వదలండి! మీకు దండం పెడతాను.. నన్నేం చెయ్యొద్దు!'' ఏడుస్తూ దీనంగా వేడుకుంటు న్నాను.

అయినా వాళ్లు నన్ను విడిచిపెట్టడంలేదు.

నేను ఇంకా గట్టిగా..

''ప్లీజ్ హెల్ప్ మీ!'' అని అరుస్తున్నాను.

''కడలీ.. లేమ్మా! నీకేం కాలేదు''.

ఎవరో నన్ను తట్టి లేపుతున్నారు. కళ్లు తెరిచి చూస్తే అమ్మ..

''పీడకల వచ్చినట్టుంది. లేచి మంచినీళ్లు తాగు!'' అన్నది వాటర్ బాటిల్ అందిస్తూ.

అవునూ.. పీడకలే! ప్రతిరోజూ ఇదే కల. నా జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసిన సంఘటనే.. నన్ను కల రూపంలో వెంటాడుతున్నది.

సన్నగా కంపిస్తున్న చేతులతో బాటిల్ తీసుకొని, గటగటా మంచినీళ్లు తాగేశాను. నన్ను పడుకోబెట్టి దుప్పటి సరిచేసి.. నా పక్కనే పడుకుంది అమ్మ. హాస్పిటల్ నుంచి వచ్చినప్పటినుంచి అమ్మ నా దగ్గరే పడుకొంటున్నది. ఒక్కక్షణం కూడా నన్ను ఒంటరిగా విడిచి ఉండటంలేదు.

నన్ను చూడటానికి స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు వచ్చివెళ్లారు. ఒక్కొక్కరిదీ ఒకో తరహా! కొందరు నన్ను నిజంగా ఓదార్చడానికి వస్తే.. మరికొందరు ఏం జరిగిందో వివరంగా తెలుసుకోవాలనే కుతూహలంతో వచ్చారు.

ఇంకా కొందరు నేనేదో వింత వస్తువైనట్టు నన్ను చూడటానికి వచ్చారు. ఎవరు ఏ ఉద్దేశంతో వచ్చినా.. అసలు రావాల్సిన వరుణ్ కానీ, తన కుటుంబం కానీ రాలేదు. అంతేకాదు.. ఇన్నిరోజుల్లో వాళ్లనుంచి ఫోన్ కాల్ కూడా రాకపోవడం ఆశ్చర్యం అనిపించింది నాకు. నా ఫోన్ పోయింది నిజమే! కానీ, అమ్మకో నాన్నకో కాల్ చెయ్యొచ్చు కదా!? అదే మాట అమ్మతో అన్నాను.

''వరుణ్ ప్రమోషన్ మీద యూఎస్ వెళ్లాడు కడలీ. వెళ్లేముందు మీ నాన్నగారికి కాల్ చేసి చెప్పాడు'' అంది అమ్మ

అమ్మ మాటలు నాకెందుకో నమ్మాలని అనిపించలేదు. తనకు సంబంధించిన ప్రతి విషయం నాకు చెప్పే వరుణ్.. ప్రమోషన్ విషయం చెప్పకుండా ఉండే అవకాశమే లేదు. ఏదో జరిగింది అనిపించింది నాకు. నా ఆలోచనలు పసిగట్టినట్టుగా..

''నువ్వు హాస్పిటల్‌లో ఉన్నప్పుడు తనకు ప్రమోషన్

**నా ప్రమేయం లేకుండా జరిగినదానికి నేనెలా బాధ్యురాల్ని అవుతాను. అసలు శీలం అంటే ఏంటి? మనిషి నడక, నడవడిక, గుణం కాదా? కేవలం శరీరంలోనే ఉంటుందా? ఎవరో అనామకుడు వచ్చి తాకితే పోతుందా? వాళ్లు ప్రేమకు, పెళ్లికీ అర్హులు కాదా?**

సంగతి తెలిసింది. నిన్ను ఆ పరిస్థితులలో వదిలివెళ్లడానికి వరుణ్ అసలు ఒప్పుకోలేదు. ఈ సమయంలో తన సపోర్ట్ నీకు చాలా అవసరం అన్నాడు. మేమూ, వరుణ్ తల్లిదండ్రులు ఒప్పించడంతో వెళ్లాడు!''.. అమ్మ తల వాల్చుకొని చెప్తుంటే, నాకెందుకో అదంతా అసంబద్ధంగా తోచినా అమ్మను రెట్టించి అడగలేదు.

* * *

డియర్ వరుణ్..

ఏమైపోయావ్!? ఈ టైంలో నువ్వు నాపక్కన ఉంటే బావుండనిపిస్తున్నది. నిన్ను చుట్టుకొని కన్నీళ్లన్నీ ఇంకిపోయేవరకూ ఏడవాలని ఉంది. నావల్ల కావడంలేదు.. ఈ దుఃఖాన్ని మోయడం. ఆరోజు గుర్తొస్తే ఇప్పటికీ నావెన్నులో వణుకుపుడుతున్నది. ఆ రాక్షసత్వాన్ని, అరాచకాన్ని, అవమానాన్ని మాటల్లో చెప్పలేను. ఆ నీచుడు స్నేహం ముసుగు వేసుకొని నాపై అత్యాచారం చేస్తున్నప్పుడు.. ప్రాణం పోతే బాగుండనిపించింది.

వరుణ్.. నన్ను చూడటానికి సన్నిహితులు, బంధువులు అందరూ వచ్చారు. వాళ్ల జాలిచూపులు, వ్యాఖ్యలు, వ్యంగ్యాలు భరించడానికి ఎంత కష్టపడాల్సి వచ్చిందో!? వాళ్లలో ఒకావిడ అన్నారు..

'అబ్బాయిలతో ఎంతలో ఉండాలో అంతలోనే ఉండాలి. వాళ్లతో స్నేహలేంటి? రాత్రిపూట కార్లలో వాళ్లతో తిరగడమేంటి?' అని..

ఆ మాటలకు ఎలా స్పందించాలో అర్థం కాలేదు నాకు. ఇంకా ఎంతకాలం మేము ఈ నాలుగు గోడల మధ్య, పరదాల మాటున ఉండాలి? ఇంకా వెనక్కి వెళ్లి ఏ ఇనుప కచ్చడాల సంస్కృతిలో ఒదిగిపోవాలి? అసలు మనుషులను నమ్మకుండా స్నేహం చెయ్యకుండా ఎలా ఉండగలం? ఎందుకు ఎప్పుడూ మాకే ఇలా ఉండాలి? అలా ఉండాలి? అని చెబుతారు. మాకు చెప్పేదానిలో వన్ పర్సెంట్ మగవాళ్లకు చెప్పినా.. ఈనాడు స్త్రీల పట్ల ఇన్ని దారుణాలు జరగవు కదా? ఎవరూ ఆ పని ఎందుకు చెయ్యరు? విచిత్రం ఏంటంటే.. ఇప్పుడు బాధితురాల్ని నేనే. నేరస్తురాల్నీ నేనే. అందుకే అసలు నేరస్తులకంటే ఎక్కువగా నాకే నీతులు చెబుతూ మాటలతోనే పొడుస్తున్నారు. ఇక మా అమ్మానాన్నల సంగతి చెప్పక్కర్లేదు. అందరికీ సమాధానం చెప్పలేక ఆఫీస్‌కు సెలవు పెట్టారు. ఎవరి ఫోన్లూ ఎత్తడంలేదు. ఇంటికి వచ్చినవారిని నా వరకూ రాకుండా జాగ్రత్త పడుతున్నారు. నేనేమైపోతానో అని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

వరుణ్.. ఎక్కడ ఉన్నావ్ నువ్వు? అమ్మ యూఎస్ వెళ్లావని చెబుతున్నది. నాకు తెలుసు.. నాకు చెప్పకుండా నన్ను ఈ స్థితిలో వదిలి నువ్వు ఎక్కడికీ వెళ్లవని. మన విషయంలో ఏం జరుగుతుందో అర్థం కావడలేదు. మాటల్లో చెప్పలేని దిగులుగా ఉంది. నా మెయిల్ చూసిన వెంటనే రిప్లయి ఇవ్వు. వీలైతే ఒకసారి నన్ను కలువు.

..మెయిల్ పంపి లాప్‌టాప్ పక్కన పెట్టాను.

ఆ రోజు నుంచి ప్రతిరోజూ మెయిల్స్ చెక్ చేసుకుంటూనే ఉన్నాను. వారం రోజుల తర్వాత వరుణ్ నుంచి మెయిల్ వచ్చింది.

'నా పేరెంట్స్ మీవాళ్లతో మాట్లాడి మన ఎంగేజ్‌మెంట్ బ్రేక్ చేశారు. ఎందుకూ.. అంటూ మళ్లీ నాకు మెయిల్ చేస్తావేమో. అందుకే కారణం కూడా చెప్తున్నాను. శీలం కోల్పోయిన అమ్మాయిని పెళ్లి చేసుకునే ఖర్మ నాకు పట్టలేదు.

గుడ్ బై!'..

ఆ మెయిల్ చూసిన నాకు మతిపోయినంత పనైంది. నాలుగేళ్లు ప్రేమంటూ నావెంట పడి.. నేను లేకపోతే బతకలేనంటూ కబుర్లు చెప్పి.. నేను ఒప్పుకోవడమే తన అదృష్టమన్న వరుణేనా ఇలా మాట్లాడేది? శీలం కోల్పోయావంటూ ఎత్తి చూపుతున్నాడు. నా ప్రమేయం లేకుండా జరిగినదానికి నేనెలా బాధ్యురాల్ని అవుతాను. అసలు శీలం అంటే ఏంటి? మనిషి నడక, నడవడిక, గుణం కాదా? కేవలం శరీరంలోనే ఉంటుందా? ఎవరో అనామకుడు వచ్చి తాకితే పోతుందా? వాళ్లు ప్రేమకు, పెళ్లికీ అర్హులు కాదా? మొదటిసారిగా వరుణ్ మీద నాకు అసహ్యం కలిగింది.

* * *

మూడునెలలు గడిచిపోయాయి. అమ్మానాన్న జీవచ్ఛవాల్లాగా అయిపోయారు. ఇల్లంతా శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది. ముగ్గురం సరదాగా మాట్లాడుకోవడం, నవ్వడం మర్చిపోయాం. ఈ మూడునెలల కాలం నాకు ఎన్నో కొత్తపాఠాలను నేర్పింది. నాలో చలనం మొదలైంది. అగాథం నుంచి ఆశవైపు చూడటం మొదలుపెట్టాను. భవిష్యత్.. ప్రేమగా రమ్మని ఆహ్వానిస్తున్నది. నా జాబ్ గురించి మా బాస్‌కు మెయిల్ చేశాను. రేపు ఆఫీస్‌కు రమ్మని రిప్లయి వచ్చింది.

ఫ్రెష్ అయివచ్చి.. రెడీ అవ్వడానికి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర నుంచున్నాను. నా ముఖంపైన గాయాల తాలూకూ మచ్చలు చాలా మటుకు మాయమైపోయినా.. అక్కడక్కడా కాస్త కనిపిస్తూనే ఉన్నాయి. వాటిని ఏ క్రీములతోనూ కవర్ చెయ్యాలనిపించలేదు. నాకు నచ్చిన డ్రెస్ వేసుకొని అమ్మనాన్న దగ్గరికి వెళ్లి.. ఆఫీస్‌కు వెళ్తున్నానని చెప్పాను. వాళ్లు ఆనందంతో నన్ను దగ్గరికి తీసుకున్నారు. వాళ్ల కళ్లు కాంతిపుంజాల్లా మెరిసిపోతుంటే.. తృప్తిగా నవ్వి, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశాను. నా ప్రయాణం అంత సులభతరం కాదని, ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురవుతాయనీ తెలుసు. అయినా వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాను. ■

## కడెం లక్ష్మీప్రశాంతి



సమాజంలో జరిగే సంఘటనలే.. రచయిత్రి లక్ష్మీప్రశాంతి కథావస్తువులు. అలాంటి ఓ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని రాసిందే.. ఈ కెరటం కథ. కడెం లక్ష్మీప్రశాంతి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామంలో జన్మించారు. తల్లిగారి ద్వారా బాల్యంలోనే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకున్నారు. ఆ ఆసక్తితోనే సాహిత్యం వైపు అడుగులు వేశారు. కళాశాల స్థాయి నుంచే కవితలల్లడం మొదలుపెట్టారు.

కథలు రాయడం మాత్రం.. 2020 నుంచి ప్రారంభించారు. మొదటి కథ.. 'అస్తమయం'. కరోనా కాలం కథలు అనే సంకలనంలో ప్రచురితమైంది. ఈనాడు సంస్థ నిర్వహించిన 'కరోనా కవితల పోటీ', అక్షరాలతోవ నిర్వహించిన కవితల పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో వెలువరించిన పూల సింగిడి, సంఘటిత, మయూఖం వంటి కవితా సంకలనాలలో లక్ష్మీప్రశాంతి కవితలు స్థానం సంపాదించుకున్నాయి. వివిధ సాహిత్య సంస్థలు నిర్వహించిన పోటీల్లో అవార్డులూ గెలుచుకున్నాయి.